

# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

"**కర్మ సిద్ధాంతాన్ని** సమీక్షించడానికి నీవు పిల్లల జీవితాన్ని తీసుకోనక్కర లేదు. మానవ జీవితాలూ పనికొస్తాయి. ఆద్దైనా, ఇద్దైనా తీసుకో వచ్చు గనుక పిల్లలను ఎంపిక చేసుకున్నానంటే నీతో పేచీ పడదలచుకో లేదు. ఐతే నీవు గ్రహించవలసిన విషయం (నేను గ్రహించ దలచుకో లేదు అంటే నేను అభ్యంతరపెట్టను) మానవ జీవితం గురించీ, మనస్తత్వం గురించీ, వేదన గురించీ నీకు ఎక్కువగా తెలుసు, పిల్లల విషయంలో ఆ సదుపాయం ఉండదు. సరే కర్మ సిద్ధాంతం మాట్లాడుకోడానికి శోధించుకోడానికి ఆసక్తికరంగా ఉంటుంది నమూనా ఏద్దైనా కావచ్చు గాని. మనం శోధించినా గాలించినా తెలుసుకోలేని తాత్త్విక విషయాలలో అదొకటి. నీవు చూసిన పిల్లల జీవితాలు అంతలా మనసును కలిచి వేశాయంటే నీ మనసు రుగ్మత పాలయిందని అనుకోవాలి, బహుశా నీవే గ్రహించగలిగినట్టు. అతి జాలి ఒక రుగ్మతగా, జాలిని పారద్రోలిన నా మనసు భావిస్తే దాన్ని తప్పుపట్టనవసరం లేదు. రుగ్మత పాలైన నీ మనసునూ నిజానికి తప్పు పట్టక్కర లేదు. రోగిని చూసి జాలిపడగలిగిన మనసు జాలిపడింది; అలా పడలేనిది మానేస్తుంది. మన ఏడుపు మనం ఏడవలేని స్థితిలో పిల్లల ఏడుపునూ మనం ఏడుద్దామనుకోవడం సాహసం క్రిందికి వస్తుంది; మూర్ఖత్వం క్రిందికి వస్తుందేమో తరువాత ఆలోచిస్తాను. నీ జాలి స్వల్పంగానైనా ఆ పిల్లలకు ఉపయోగపడినందుకు కాస్తో కూస్తో సంతోషపడ దగిన విషయమే. మనం జీవించాలి; మరొక జీవిని జీవించనీయాలి – ఎంతవరకూ? మనం జీవించాలంటే మరో జీవిని జీవించనీయడానికి వీలు లేనంత వరకు. పిల్లలు మనం జీవించడానికి అడ్డురావని ఒప్పుకుంటున్నా. కానీ అడ్డొచ్చే పాములున్నాయి, తేళ్లున్నాయి, పులులలాంటి జంతువులున్నాయి. మనం జీవించడానికి అడ్డొచ్చే అసలు జీవి మనిషి. అంచేతా మన జాతి జీవిని మట్టుపెట్టడానికి సందేహిస్తే, ఆ జీవీ మనలను ఆ పని చేస్తుంది. నీ జాలి గుణాన్ని ప్రదర్శించుకోవడం – నీవు నీకై – కూడా ఆత్మా సంతృప్తినిచ్చే విషయం కూడా. తద్వారా ఇతరుల మెప్పుకోలునూ

పొందవచ్చు. సుదీర్ఘ ప్రసంగం చేసి నీ ఆలోచనా చతురతను చాటు కున్నావు. దాని వలన కాలాన్ని విలువైనదానిగా భావించే నాకు నష్టం కానీ, కాలంతో పని లేని నీకు కాదు. ఎన్నో రకాల త్యాగాలున్నాయి మానవ జీవితంలో. కాలాన్ని త్యాగం చేయడం కూడా వాటిలో ఒకటి. అలా అని నేను త్యాగధనుడిని అని నా డబ్బా నేను కొట్టుకోను. నీవు కొడితే ఒద్దన్ను– నా సమయాన్ని అధికంగా వృథా చేయనంత వరకు. నీవు నీ జ్ఞానాన్నో, అజ్ఞానాన్నో నాతో పంచుకోవాలని చూస్తున్నట్టుగా కూడా నేను భావిస్తున్నా; సానుభూతితో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నా నాకు అది ఇష్టం లేకపోయినా. ఉరికంబం ఎక్కేవాడిని నీ ఆఖరి కోర్కె ఏమిటీ అని అడుగుతాము మనలో మానవత్వం ఉండటం వలన; మానవత్వం ఉంటె వాడిని ఉరి ఎందుకు వేస్తాము అని ఎదురు ప్రశ్న నీవు వేయవనుకుంటాను. నీ ఆఖరి కోర్కె నీ మాటలుఎవరన్నా వినడం; ఆ కోర్కె ఉద్దేశం ఏదైనా కావచ్చు. నీవు చెబుతున్న విషయాలు, ఉన్నత భావాలతో నా బుర్ర పుచ్చింది మొన్నటిదాకా; నా జీవితం రెండు అధ్యాయాలుగా చీలిపోయింది. నీ ఆలోచనలు నాకు కొత్తవి కాదు. ఆ ఉన్నతమైన ఆలోచనలను కాలదన్నాను జీవించ దలచుకోబట్టి; నీవు జీవించ దలచుకో లేదు కాబట్టి నీ చావు ముంగిలిలో కూడా వాటిని నెత్తిన ధరించి ఉన్నావు."

"కర్మ, కర్మ అంటున్నాము – కొందరు మహామహులు దానిపై చర్చోపచర్చలు చేసి ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రతి చర్చా ఒక అహేల మల్లయుద్ధం; మల్లయోధుల మేధలు పులిసిపోవడమే కాని సత్యం నికరంగా బైటపడదు. అసలు ముందు ఏది చెడు, ఏది మంచి; ఏది పుణ్యం, ఏది పాపం అన్నది తేలాలి. దాన్ని మనిషిని సృష్టించే శక్తి తేల్చాలి. మనిషికి అది తెలియాలి. అది జరగలేదు. అది అలా తెలియనక్కరలేదు, ఫలితం మాత్రం చచ్చినట్టు అనుభవించాలి అని అనుకోవాలేమో. కేవలం ఈ విధంగా అనుకుందాము – ఏది బాధకు దారి తీస్తుందో అది చెడు; ఏది సంతోషానికి దారి తీస్తుందో అది మంచి. ఎవరినైనా హత్య చేయడం వలన హత్య చేయబడిన వాడిది బాధ; చేసిన వాడికి ఆనందం లేక ఊరట కలగా వచ్చు. జరిగినది ఒకే పని [ఒకడి మరణం]. దాని ప్రభావం భిన్నమైనది, ఇరువురిమీదదీ. అందుచేత దాన్ని చెడుగా పాపంగా భావించ వచ్చు. అంటే ఏదైనా పని ఎవరినీ బాధించనిదైతే దాన్ని మంచిదిగా భావిస్తే తప్పులేదు. శుక్రాచారుడు కచుడ్ని చంపినవాడితో అంటాడు: "కార్యాలు తప్పక ఫలితాలిస్తాయి – మితి మీరిన భోజనం చేసినపుడు కలిగే ఫలితంలా,"

"నేను మాట్లాడొచ్చా?"

"మాట్లాడు. అంత వినయం అక్కర లేదు. అది ఎవరి లక్షణమో సర్వజ్ఞుడవైన నీకు తెలుసు," అన్నాడు అనంతం.

"మీరు అంటున్నదానికి నేను చెప్పబోయేది కొనసాగింపు మాత్రమే, అన్నయ్యా. ధర్మరాజుకు అనుమానం ఒచ్చింది కర్మ సిద్ధాతం మీద. మంచీ చెడుల మీదే ఫలితాలుంటాయో లేదో అన్నది దేవుళ్ళకు మాత్రమే తెలిసిన నిగూఢమైన విషయం. ఇక విధి అనే శక్తి కారణం గాను మనిషి కొన్ని కార్యాలు చేస్తాడు, కర్మ కారణంగానే కాక. విధి ప్రభావంనుంచి కూడా, కర్మ ప్రభావం లాగానే తప్పించుకోడం అసాధ్యమట. ధర్మ రాజు అన్న దాని ప్రకారం 'దిష్ట బతీయ'; దుర్యోధనుడు

మోసం చేస్తాడని తెలిసి వాడు జూదం ఆడదాం రా అన్నప్పుడు పోకుండా ఉండలేకపోవడం దానికి ఉదాహరణ. చేసిన కర్మ కారణంగా కాక ఏ కష్టమైనా, నష్టమైనా మనిషికి కలగడం దేవుడు కారణంగా మాత్రమే అని వనవాస సమయంలో భర్తకు వచ్చిన కష్టానికి ఓర్చుకోలేక అంటుంది ద్రౌపది. 'జీవకోటి అనుభవించవలసిన సుఖం, దుఃఖం, ప్రియం, అప్రియం అనే వాటిని  విత్తును స్థలించే ముందే నిర్ధారిస్తాడు (దేముడు),' అంటుంది."

"దిష్ట బతీయ!" అంటూ నవ్వాడు అనంతం; రెండో వ్యక్తికీ అర్థమయింది.

"నేను పిల్లుల వృతాంతం చెబుతున్నప్పుడు ఒక పిల్లి తన కర్మ ఫలాన్ని అనుభవిస్తున్నప్పుడు దానితో పాటు మరొకటి ఎందుకు అనుభవించాలి అన్న ప్రశ్నను లేవనెత్తాను. మనం ఎన్ని ప్రశ్నలు లేవనెత్తితే అన్ని సమాధానాలు పుట్టుకొస్తాయి. ఒకరి కర్మ మరొకరిని ప్రభావితం చేస్తుందట. ఒకడి పాపం మరొకడి గొంతుకు కూడా చుట్టుకుంటుంది. శుక్రాచార్యుడు అదే అంటాడు. నీ పాపం నీ మీద ఫలితం చూపించడం ఆలస్యమైతే నీ మనవలు, నీ కొడుకులు కూడా దాన్ని అనుభవించక తప్పదు అని. ఎంతన్యాయమో చూడండి! బౌద్ధ మతంలోనూ ఈ విషయం ముచ్చటించబడినదట. ఒకడి కర్మ విపాకం ఫలితం వాడిని దాటి మిగతా వాళ్ళ గత కర్మ కారణంగా ఇద్దరు సంతానంలో ఒకరిని మరొకరు హత్య చేస్తే, అలాంటి హింసాత్మక సంఘటన ద్వారా ఒక సంతానాన్ని కోల్పోవడం ద్వారా వచ్చే బాధ శిక్షగా అనుభవించక తప్పదు. ఆ విధంగా కేవలం ఒక కొడుకు తన పాప ఫలితంగా హత్యకు గురవడం కాదు. ఇద్దరు కొడుకులు, తల్లిదండ్రులు నలుగురి కర్మల సంగమమది.

"మార్కండేయ పురాణం ప్రకారం ఆదిలో అన్ని ఆత్మలూ శుద్ధిగానే ఉండి, శరీరాలలో ఇమిడి ఉండడం జరిగిందట. ఎలాంటి శారీరక బలహీనతలు, నైతిక లోపాలు లేక పవిత్ర కార్యాలను ఆచరిస్తూ, సత్యవంతంగా, భగవంతుడిని తలపింప చేస్తూ మనుషులు మెసలేవారు. వేల సంవత్సరాల పిదప కామం, క్రోధం అనే కవలల ధాటికి తట్టుకోలేక భ్రాంతికి, దురాశకి బానిసలయ్యారు. అంతే కాక గాబరా, అనైతికతలు కూడా జతై కర్మల, పునర్జన్మల పాలైనారు. భాతృ హత్య జరిగినప్పుడు తల్లిదండ్రులు మరణించిన వాడి హత్యకు జైనులు కర్మ బంధం నుంచి విముక్తికి సంబంధించి కొన్ని లెక్కలు చెబుతారు. ప్రతి అర్ధ సంవత్సరాల, ఎనిమిది క్షణాలకు నూట ఎనభై ఆత్మలు విముక్తి పొందుతాయి. అంటే కర్మకు ఆది అంత్యాలున్నాయన్నమాట. 84,00,000 మహాకల్పాల పయనం తరువాత ప్రతి ఆత్మకు మోక్షం సిద్ధిస్తుంది. కాబట్టి మనం నిరాశకు గురవక్కర లేదు. ఓపికగా వేచి ఉంటే చాలు.

"మనం మాట్లాడుకున్న మంచి-చెడుల వ్యవస్థకు,  కర్మ సిద్ధాంతానికి కేంద్ర బిందువు దేవుడు; దేవుడి గురించీ కొంతవరకైనా ముచ్చటించ వలసిన అవసరముంది; నీవు అనుమతిస్తే, ఏమంటావు?"

"కానివ్వమంటాను. నా సహనానికి, సహిష్ణతకు నీతో మాట్లాడడం లేక నీ ఉపన్యాసాలను వినడం అగ్ని పరీక్ష, జల పరీక్షానూ. జీవించడానికి ఆ రెండు లక్షణాలు అవసరం."

"దేముడు ఉన్నాడని నమ్మాలంటే మనలను అనేక ప్రశ్నలు వేధిస్తాయి. లేదు అన్న నిశ్చితాభిప్రాయానికి రాగలిగితే బుర్రకు ఏ బెడద ఉండదు. నీరు నిండిన కళ్ళతో ప్రతిదానికి ప్రశ్నర్థకంగా  ఆకాశం వైపుచూడక్కరలేదు. అయితే నాస్తికులకు ఏడుపులు ఉండవా? దేని దారి దానిదే."

"డార్విన్ చెప్పినట్టు సృష్టి దానంతట అది; ఎవరి సృష్టి వాళ్ళ ప్రమేయంతో జరుగుతాయా? మరి డార్విన్ సిద్ధాంతం తరువాత కూడా అంతకు ముందున్న ప్రశ్నలు మిగిలే ఉన్నాయి!" అనంతం అన్నాడు.

"లేదు. అందుకేగా ఈ సగటు జీవి తన జీవిత చరమాంకంలో సృష్టి రహస్యాలను తన మనోవనంలో వేటాడుతున్నాడు. రోజినాన్ట్ అనే గుర్రాన్నీఎక్కి తిరిగిన  డోన్ క్విక్సోట్ (Don Quixote) నా పూర్వీకుడు. ఎక్కడానికి నాకు కుంటి గాడిద కూడా లేదు. గాడిద గాడిదను ఎక్కి స్వారీ చెయ్యడానికి వీలులేదు, అన్నయ్యా!"

"ఈ భయంకర ప్రయాణంలో కలదు కలండనువాడు కలడో లేడో అనుకోడంకన్నా ఉన్నాడు అనుకోడంలో గడ్డిపోచంత ఊరటన్నా దొరక వచ్చు. లేదు అని అనుకోడానికీ తిరుగులేని కారణాలూ లేవు."

"ఉన్నాడని అంగీకరించడంతో ఒక సదుపాయం ఉంది. తిరుగుబాటు చేసి ఆత్మహత్య చేసుకో వచ్చు."

"మనకు ఇచ్చిన దానితో సంతృప్తి పడగలిగినపుడు దేవుడితో మనిషి ఏ సంఘర్షణకూ దిగడు. నాకు ధైర్య దారిద్రియం మాత్రం  ఇవ్వబడలేదు; ఆరోగ్యాన్ని, అందాన్ని, పట్టుదలను, ఎలాగైనా జీవించాలన్న బలమైన కోర్కె నాకున్నాయి. నాకు కలగని నష్టాల జాబితా ఒక్కోసారి చూసుకుంటుంటే నాకు కలగని నష్టం ఒక లాభంగా తోస్తుంది – కొందరిలా అంగ వైకల్యం లేకుండా ఉండటం నాకు కలిగి ఉన్న లాభమే కదా? దేవుడిమీద తిరుగుబాటు చేసి నీవు సాధించగలిగింది ఏమిటి? చావు."

"అవమానానికి ప్రతీకారం; ఆత్మ గౌరవాన్ని చాటుకోవడం; దుర్భరమైన జీవితం నుంచి ఉపశమనం బోనసుగా పొందడము."

"పరమ పిరికితనమూ అందులో ఉంది కదా; యుద్ధం లోనుంచి పారిపోయినట్టు. శత్రువు అనుకున్న శక్తితో పోరాడలేక నీ ప్రాణం నీవే తీసుకోవడం వలన ఆత్మ గౌరవానికి భంగమూ కలుగుతోంది కదా."

"ఏటికి ఎదురు ఇదే శక్తి నాలో లేదు; పైగా అది వృథా. ఆత్మగౌరవం కావలసినంతుంది. నాకు ఏదుందో దాన్ని చాటుకునే మార్గంగా చావును ఎంచుకున్నా. నీవిచ్చిన నీ జీవితం నాకు అక్కరలేదని తిరిగి దాన్ని వెనుకకు ఇచ్చేయడంలో– ఒక వేళ భగవంతుడంటూ ఉంటే – కనీసం నిరసన తెలియజేయడం క్రిందికి రాదా?"

"అదీ భగవంతుడే నీచేత చేయిస్తున్నాడేమో. మనిషే మనకు అంతుపట్టని రహస్యం; దేముడిని అంచనా వేయగలమా?"

"అన్నయ్యా, నా ధోరణి నీకు జలుబులా అంటుకుంటుందేమో నీవు భయపడినట్టు."

"ఆబ్బే, నాకు అంత తేలిగ్గా ఏ జబ్బూ అంటుకోదేమో. జీవించాలన్న ధృఢ సంకల్పంతో ఉన్నా; నాకు దేముడు దయ్యాల గురించి ఆలోచిస్తూ ముక్కుతూ మూలుగుతూ నులక మంచం మీద వెల్లకిలా పడుకుని ఆకాశాన్ని చూస్తూ గడపడానికి వ్యవధి లేదు."

"కరంజోవ్ సోదరులు అన్న నవలలో దాస్తోవిస్కీ ఇవాన్ చేత చెప్పించిన మాటలు ఆసక్తిని కలిగిస్తాయి. క్రీస్తుకు పూర్వం 'ఎలెమెంట్స్' అన్న గణితశాస్త్రం వ్రాసిన గ్రీకు దేశస్థుడు యుక్లీడ్ సమాంతర రేఖలు కలుసుకోవు అని చెప్పాడు. తదుపరి కొందరు ఇక్కడ కాకపోయినా మరో ప్రపంచంలో కలుస్తాయి అన్నారు. ఇవాన్ అభిప్రాయం ప్రకారం మనిషి మెదడు రోదసిలో మూడు పార్శ్వాలున్న విషయాలను మాత్రమే అర్థం చేసుకోగలదు. సమాంతర రేఖలు ఎలా కలుస్తాయో చూడలేని నేను దేముడిని చూడటం అసాధ్యం. మిగతా వాళ్లలాగే నా మెదడూ మూడు పార్శ్వాలను మాత్రమే దర్శించగలదు. మెదడు అందుకోలేని జ్ఞానం ఉంటుందంటే తార్కికంగా నేను కాదనలేను. దేముడు నాకు అర్థంచేసుకోడానికి వీలవని శక్తేమో; అలా అంగీకరించేస్తే నాకు చెందినంతవరకూ సరిపోతుంది – ఉన్నాడు లేక లేడు అని మొండిగా వాదించకుండా. దేవుడు సృష్టించిన లేక సృష్టించని ఈ లోకాన్ని నిరాకరిస్తున్నా – దేముడే నిజానికి సృష్టించి ఉండుంటే నాకున్న నా మెదడుతో అలా నిరాకరించగలిగిన మెదడు నాకు ఇవ్వబడింది. వెళ్లిపోతున్న నాకు ఆగామి కాలంలో మెరుగైన లోకం ఉండునా, ఉండదా? అన్న ఆలోచన నాకు అనవసరం. అలా నేను అనడంలో నా సంకుచితపు ఆలోచనను దాచుకో దలచుకోలేదు.

"జిడ్డు కృష్ణమూర్తి ఆలోచన ఆయనది; ఇంకొకరి అభిప్రాయాన్ని ఆయన ఎరువు తెచ్చుకోనందున. దేవుడిని చూశానని కానీ, చూడగలిగాను అని కానీ ప్రకటించని నిజాయితీ పరుడు. 'దేవుడు అన్న మాట, దేవుడు మోసగొట్టు సృష్టి. దేముడిని కనిపెట్టటానికి మతాలను సృష్టించుకున్నారు. ఈ ప్రపంచమంటే మొహం మొత్తి దైవ శోధనకు మనం పూనుకున్నామంటే ఆ చర్య ప్రపంచ పోకడ నుంచి పారిపోవడానికి దేవుడు సాధనం కాకూడదు. దేముడు ఉన్నాడా లేదా అన్న ప్రశ్నకంటే, దేముడిని ఎలా కనుగొనాల అన్నదే అసలు సమస్య. అసలు దేముడంటే ఏమిటి? దేముడు ఒక పదం కాదు. పదం, వస్తువూ వేరు వేరు. అనేక మారులు ఏదైనా పదాన్ని ఉచ్చరించినా తెలుసుకొనేది దేవుడి గురించీ కాదు. దేముడి గురించి తెలిసినపుడు కదా అలా తెలుసుకున్న దానిని దేముడు అని పిలవాలి; లేక శోధన జరగాలి. నీవు సృష్టించింది దేముడు అయ్యే వీలు లేదు. మనసుకు తెలియని విషయాన్ని మనసు ఆలోచించలేదు.' అదీ జిడ్డు అభిప్రాయం.

"దాస్తోవిస్కీ, జిడ్డు ఒకే అభిప్రాయానికి వచ్చారు. వాళ్ళు తమ తమ ఆ అభిప్రాయాలకి రావడానికి కారణాలు కాస్తో కూస్తో వేరైనా. దేముడి గురించి తెలుసుకోడం అసాధ్యం అన్న విషయంలో ఒకరితో ఒకరు ఏకీభవించినట్టుగా మనం భావించవచ్చు. దానర్థం 'దేముడిని' మనమే సృష్టించుకుని గుడ్డిగా నమ్ముతున్నామేమో. దేముడిని గుడ్డిగా నమ్మడం.

కాకపోతే – ఏదీ దానంతట అది జరగదు అన్న నిశ్చితాభిప్రాయాన్ని కలిగి ఉండటం చేత, మనం తెలుసుకో లేక పోయినా ఎదో శక్తి వుండే ఉంటుందన్న నమ్మిక ఏర్పడింది.

"ఒక మనిషి మానవత్వం లేక 'దానవత్వం' దేవుడి అస్తిత్వం మీద మాత్రమే ఆధారపడుండదు. మనుషులంతా మూకుమ్మడిగా దేవుడిని నమ్మడం, నమ్మకపోవడం జరగని విషయం. అందుచేత దేవుడు లేకపోతె దేవుడిని సృష్టించుకోవాలి అని సన్నాయినొక్కులు నొక్కక్కరలేదు. వోల్టాయిర్ కు ముందే బ్లెయిజ్ పాస్కల్ దేముడిని ఒక అవసరంగా భావించాడు. హేతువు ద్వారా భగవంతుడు ఉన్నాడో లేదో కనుక్కోవడం అసాధ్యం గనుక దేవుడున్నాడని భావించడమే మంచిదని, దానివలన కోల్పోయేది అంతగా లేదుగదా, పొందే లబ్ధి అపరిమితం అని అన్నాడు. ఆ సిద్ధాంతం పేరు పాస్కల్స్ వేజర్ {Pascal's wager]. అందరూ అంగీకరించే సిద్ధాంతం అంటూ ఉండదుగనుక లాభనష్టాల దృష్టితో అలా దేవుడిని చూడటాన్ని నాస్తికులతో సహా ఆ సిద్ధాంతాన్ని తప్పుపట్టక్కరలేదు. వోల్టాయిర్ దేముడిని సృష్టించుకోవాలని అనుకోడానికి [బహుశా] పదమూడో శతాబ్దపు 'ముగ్గురు మోసగాళ్లు' [The Three Impostor] అన్న ప్రవక్తల గురించీ ఆకాశరామన్న వ్రాసిన పుస్తకం ప్రేరణ. అసలు దేముడు ఉన్నదీ లేనిదీ తప్పనిసరిగా తెలియవలసిన అవసరం ఉందా? దేముడి పనిని దేముడిని చేసుకోనిచ్చి, మనపనిలో మనం నిమగ్నం అవలేమా? ఆయనకూ మనం నమ్మడం, నమ్మకపోవడం అనవసరమనిపించడం వలన తన ఉనికిని నిగూఢంగా ఉంచివుండవచ్చు. సర్వాంతర్యామి అనేసుకుకంటే గొడవే లేదు. మనిషి సృష్టించబడటం లేక పుట్టడం ఆ వ్యక్తికీ జరిగే ఏదో ఉపకారంగా మనం భావించక్కరలేదు. దేవుడూ అలా భావించకపోవచ్చు. అన్నివిధాలా సరైన జీవితాన్ని కానుకగానో శాపంగానో ఏ మనిషన్న పొంది సంపూర్ణ సంతోషంతో జీవించగలిగినపుడు కూడా తన సృష్టికర్త పట్ల ప్రేమను, లేక ద్వేషాన్ని కలిగి ఉండక్కరలేదు. మనిషి తన పుట్టుకను ముందుగా కోరుకోలేదు. భయంకరమైన జీవితాన్ననుభవించే వ్యక్తి నిజానికి [దేవుడున్నాడన్న నమ్మకం కలిగితే] ఆయనను ద్వేషించడం న్యాయం కూడా. కర్మానుసారం జీవితం ఉంటుంది అనుకునేట్లయితే దేవుడి పాత్ర ప్రశ్నార్థకం అవుతుంది. సరే దేవుడు కలడు అని నమ్మాననుకోండి. ఆ పిదప నేను ఏమి చెయ్యాలి? భజనలూ, పూజలూనా? ఎందుకూ? అవంటే దేవుడికి ఇష్టమనీ, మనకు ప్రతిఫలంగా ఏదన్నా మంచి చేస్థాడనా? చేయకపోతే ఆయనకు కోపం వచ్చి మనకు చెడు చేస్తాడానా? మనిషి గుణాలే దేవుడిలో ఉన్నాయనుకోవాలి అలాంటప్పుడు. దేముడికి మతం ఉండదు. దేముడిచుట్టూ మనం అల్లినదే మతం. దేముడు నిజానికి ఒక నిమిత్తం; మనిషి మతాన్ని ఒక అవసరంగా, దేవుడిని చేరటానికి మాధ్యమంగా సాలెగూడులా అల్లాడు. దాని ప్రాధాన్యతను నేనూ గుర్తించాను [నవ్వు]. వందల మతాల ఆవశ్యకత మనిషికుంది తన ఆధ్యాత్మిక ఆకలి తీరాలంటే. అన్ని ఉండటం ఒక ప్రత్యామ్నాయాలను ఇవ్వడం. కాలాన్నిబట్టి మతాలు పెద్దగా మారవు. మతం ఒక జడపదార్థం. మతాలు మనుషుల మధ్య గోడలు అని పెదవి విరవవచ్చు; ఏ (మత) మంద ప్రత్యేకత దానిగా ఒక ప్రత్యేకతతో, జీవించే వీలుంటుందని భావించుకోనూ వచ్చు.

"దేముడి గురించిన మీమాంస సృష్టి ఆది నుంచీ ఉండే ఉంటుంది; కనీసం మనసు తార్కికంగా ఆలోచించడం ఆరంభించినప్పటి నుండి. ఆ విషయమే కాక, ఏది మంచి ఏది చెడూ అన్న విషయంగురించీ కూడానూ. కర్మ సిద్ధాంత నిజానిజాలు ఏనాటికీ తేలవు. 'అవి ఉండేవుంటాయి' అని భావిస్తూ జీవించడమే మిగిలినది. మనిషి వేదన ఆ విషయాల జోలికి వెళ్లకుండా జీవించే అవకాశాన్ని ఇవ్వదు. హేతువు అనే కత్తితో ఛేదించలేని విషయాలను ఛేదించే ప్రయత్నం కొనసాగుతుంది; జీవిస్తూ పోవడానికి చివరకు పాడెను ఎక్కడానికి అలాంటి శోధన అవసరం లేకపోయినా."

"ఊదరకొడుతున్నావు. బాగానే ఉంది కానీ నాకు ఆ విషయంలో ఆసక్తి ఉందో లేదో కూడా నీకు తోచినట్టులేదు. భూమికున్నంత ఓపికగా భరిస్తున్నా. నీకు రుణపడి ఉంటా గత జన్మలో," అనంతం అన్నాడు.

అతను పల్లికలించాడు కళ్ళు మూసుకుని. అనంతం దృష్టి మరల్చాడు.

"నిన్ను కట్టి పడెయ్యలేదు, అన్నయ్యా. లేచి నీ తువ్వాలు దులుపుకుని ఇంచక్కా వెళ్లిపోవచ్చు. ఏదో నీకూ నాకూ తెలియని నీలోని ఆసక్తి, కుతూహలం నిన్ను లేవనియ్యడం లేదేమో. పోయే వాడి మాటలు వినేస్తే పోలా? కాకపోతే ఒక గంట కాలం వృథా అనేసుకోవచ్చు. ఒకరి మనసును మరొకరం చదవలేము. అది నిజంగా మనిషికి ఇవ్వబడిన వరం."

"నీవు చెప్పిన కారణాలు కాక మరొకటి బలమైనది ఉండి ఉండొచ్చుగా?"

"వినడం వలన నీకు చేకూరే లాభం ఏముంది?"

"నీవు ఎలా మరణిస్తావో చూద్దామన్నా కుతూహలం కావొచ్చేమో."

"అయితే నీ కోర్కె తీరుస్తా. నీ కళ్ళ ముందే చస్తా. చూసి భరించగల శక్తి ఉందా?"

"నన్ను నేను పరీక్షించుకుంటా."

"అలాగే కానీ. దేముడి విషయం కొనసాగిద్దాము, ఒక కొలిక్కి దాన్ని తెద్దాము. పరమ దుర్మార్గుడు మార్కి డే సాడే అభిప్రాయాలు తెలుసుకోవడమూ అవసరమే. దేముడు అన్న ఒక్క భావన ఏర్పరచిన వాళ్ళను తాను క్షమించలేడట. 'దేముడు లేదు. ప్రకృతీ తానొక్కతే చాలు; దీనికి రచయితతో పనిలేదు. బాధను మించిన సౌఖ్యం లేదు. నీ శరీరమనే దేవాలయంలో తనను కొలవమంటుంది సృష్టి.' దేవుడి అవసరముందని దాస్తోవిస్కీ భావించగా సాడే అలాంటి సృష్టి ఒద్దన్నాడు. నిజానికి దాస్తోవిస్కీ తత్త్వానికి ప్రేరణ సాడెను వ్యతిరేకించడం అంటారు. సంశయాత్మకతను భగవద్గీత గర్హించింది. వివేక హీనుడు, శ్రద్ధారహితుడు, సంశయగ్రస్థుడైన వాడు భ్రష్టుడై నశిస్తాడట. సంశయాత్మునికి ఈ లోకం ఉండదు; పరలోకం ఉండదు, సుఖమూ ఉండదు. నిజమేగా, అన్నయ్యా? ఆఖరి విషయానికి సంబంధించినంతవరకు అటో ఇటో తేల్చేసుకుని ఆ ఊసుకు మనసులో చోటు ఇవ్వకుండా ఉండగలిగితే కొంత సుఖాన్ని కలిగి ఉంటాము. అర్జునిడిలోని సంశయాత్మకతను కృష్ణుడు పోగొట్టడంవలన అర్జునుడు అంతమందిని చంపగలిగినాడు. అలా చంపడమూ భ్రమ; అంతే కదా? సంశయం కలగడమూ దాన్ని కోల్పోవడమూ కూడా భ్రాంతే. ఆత్మకు చావు లేదు. దుస్తులలాంటి శరీరాలను నిర్మూలించాలి; చంపేవాడు లేదు చచ్చేవాడు లేదు.

"ప్రపంచాన్ని నిరాకరించడానికి ఇవాన్ కరంజోవుకు జీవితంలోని వేదనే కారణం. బహుశా దాస్తోవిస్కీ ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసుంటాడు. ఆ రచయితా అనుభవించిన భయంకరమైన వేదనాభరితమైన జీవితం సహజంగానే అతనికి ప్రశ్నించే, శోధించే గుణాలను ఏర్పరిచాయి. చూసిన జీవిత సంఘటనలను ప్రస్తావిస్తాడు. ఆ కారణాలుగా ఇవాన్ ద్వారా ఇంత క్రూరాత్మకమైన జీవితం నాకు ఒద్దు అంటాడు."

"నీ మాటలను, ఇవాన్ లేక దాస్తోవిస్కీ అభిప్రాయాలను భగవంతుడే అనిపిస్తున్నాడేమో. అది ఒక లీల; పలికించెడి వాడు రామభద్రుండు. ఉద్దాలకుడు తన కొడుకు శ్వేతకేతుతో ఏమంటాడు? శ్రద్ధత్వా సోమా యతి – నా ప్రియమైనవాడా, నమ్మకాన్ని కలిగి ఉండుము అని. బాధకు తట్టుకోలేక ఆశ చచ్చినపుడు గజేంద్రుడు 'కలడు కలడు అనెడువాడు కలడో లేడో' అని సంశయాత్మకుడవుతాడు. గోపన్న నమ్మకం చివరిదాకా కోల్పోకుండా రాముడిని మందలిస్తాడు; ఎత్తిపొడుస్తాడు. త్యాగయ్య 'కలిగి యుంటే కదా కలుగును కామితా ఫలాధ్యాయక.' అంటూ వాపోతాడు. భక్తిమార్గమూ కష్టదాయకమైనదే, వేదనా భరితమైనదే...."

"అన్నయ్యా, అన్నయ్య, ఆపు. నీవు నేను చెప్పేది విని అర్థంచేసుకోగలవే అని భావించాను గాని, నాకు ప్రబోధించగలవని అనుకో లేదు. దేముడు మంచివాడైతే ఇలాంటి ఘాతుకమైన ప్రపంచాన్ని ఎందుకు సృష్టించినట్టు? ఆ ప్రశ్నకు సమాధానం మరో ప్రశ్న వేసే వీలు లేనిది; ఇంతవరకూ దొరకలేదు. సమాధానం దొరకని ప్రశ్నను పదే పదే వేసుకోవడం మానం; మనం నిరాశాజీవులమే కాక, ఆశాజీవులం కూడా అవడం వలన. మనిషి స్వభావం మంచిది కాదు. తన దగ్గిర ఉన్న తప్పు గురించీ కూడా దేవుడిని ప్రశ్నించడం ఆనవాయితీ అయిపోయింది: 'భగవంతుడా, మాకు ఇలాంటి స్వభావాన్ని ఎందుకిచ్చావు?' దేముడి వైపు చూపించే ఒక వేలే మన కంటికి కనిపిస్తుంది కానీ మిగతా నాలుగు వేళ్ళూ ఎటువైపు మళ్ళిఉన్నాయో కనబడదు. మనిషి తనను తాను ఎరిగిననాడు బ్రహ్మలో ఏకమైపోతాడు గనుక బ్రహ్మ గురించీ చెప్పే అవకాశం మనకు లేదు. మనుషులు మూకుమ్మడిగా బ్రహ్మలో ఏకమయ్యే ప్రసక్తి లేదు. ఎవడి ఏడుపు వాడు ఏడ్చుకుని బ్రహ్మలో విలీనమవడానికి చూసుకోవాలి.

"అలెగ్జాండర్ పోప్ అన్నాయన (తన కంటితో తాను చూసినట్లు), ఒక అద్భుతమైన వ్యాస కవిత వ్రాసా డు. దాని పేరు 'మనిషి మీద వ్యాసం' [An Essay on Man]. పద్దెనిమిదవ శతాబ్దంలో దేముడినీ, ఆయన లేక ఆమె లేక దాని సృష్టినీ సమర్థిస్తూ ఇలా ప్రవచించాడు: దేవుడు తీర్చిదిద్దిన లోపరహిత ప్రపంచం మధ్యలో ఉన్నపుడు మానవుడికి జీవితం అస్తవ్యస్తంగాను, అక్రమంగాను ఉన్నట్టు తోస్తుంది; మానవుడి పరిమిత మేధతో ఈ తీర్చిదిద్దబడిన ప్రపంచంలో లవలేశం మాత్రమే అర్థంచేసుకునే వీలుంది; అర్థ సత్యాలను మాత్రమే అనుభవించవచ్చు; అందుచేత ఆశను నమ్ముకుని బ్రతకాలి; ఆశ నమ్మకానికి దారి తీస్తుంది; ఒక గొప్ప పథకం ప్రకారం ఏర్పడిన సృష్టి వ్యవస్థలో మానవుడి పాత్ర అప్రధానమైనదని గ్రహించాలి; మానవుడు సాధారణంగా పొందాలని ఆశించే భాగ్యం, అధికారం, కీర్తి – వాడు లీలగా మాత్రమే గ్రహించగలిగిన గొప్ప ప్రపంచ నేపథ్యంలో – విలువలేనివి; ఈ ప్రపంచంలో మంచిగా తాను ఉన్నా నష్టపోతున్నందుకు

తన కృషి తాను చేయాలి; ఆ ప్రక్రియలో మనిషి స్వాభావిక బలహీనతల వలన విఫలమవుతాడు; మనం చేదుగా భావించే సంఘటన మన మంచికే ఉద్దేశించబడింది; మనిషి ముందు తనను తాను తెలుసుకోవాలి; దేముడిని పరిశీలించే ఆలోచనను మానుకోవాలి.' ఆ కవితా వ్యాసం మెచ్చుకోబడింది.

“అది అలా ఉండగా, 1755 వ సంవత్సరంలో పోర్చుగల్ రాజధాని లిస్బన్ తీవ్రమైన భూకంపం వలన నేలమట్టమైంది. లక్షమంది జనం భూస్థాపితం అయ్యారు. ఆ సంఘటన నేపథ్యంలో – సృష్టిలో అంతా సక్రమమే, మన మంచికే అన్న పోప్ మరియు ఇతర తత్త్వవేత్తల వైఖరి వోల్టాయిర్ను రెచ్చగొట్టించి 'కాండైడ్' (ఆశావాది) అన్న నవలను వ్రాయించింది; 'లిస్బన్ విధ్వంసం మీద కవిత' ను వ్రాయించింది. కవిత ఉపోద్ఘాతంలో భూకంపమనే చెడు వలన జరిగిన 'మంచి' గురించి ఇలా వ్యంగ్యంగా అన్నాడు: 'చనిపోయిన వాళ్ళ వారసులకు ఆస్తిపాస్తులు దక్కి భాగ్యవంతులవుతారు; తాపీపని వాళ్లకు చేతినిండా పని దొరికి ఆ నగరపు పునర్నిర్మాణంలో ధనవంతులవుతారు; భూగర్భం పాలైన శవాలను పీక్కు తిని జంతువులు బలుస్తాయి; కావున మీకంటూ తటస్థించిన చేదుఅనుభవం గురించి మథన పడకండి; మీరు ప్రపంచ శ్రేయస్సుకు తోడ్పడుతున్నారు.' కవితలో, ఇది మంచి దేవుడి చర్యా? అని ప్రశ్నించాడు. 'లిస్బన్ జరిగిన చెడుల కారణంగా ఆ నగరానికి ఆ శిక్ష పడిందని మీరు అనుకుంటే సుఖానందాలలో మునిగి తేలే పారిస్, లండన్ల కన్నా లిస్బన్ ఎక్కువ శిక్షార్హురాలా?' వాల్టాయిర్ స్పందనకు రూసో ప్రతిస్పందిస్తూ ఒక తీవ్రమైన లేఖను పంపాడు: 'నీ కవిత మూలుగుతున్న జనాల బాధల జాబితాలో మరొకటా? ఓదార్పు ఏది? అంతా చెడేనని నా నిరుత్సాహాన్ని అధికం చేశావు – ఉపశమనం కలిగించడం మాని; ఆశావహంగా ఉండటం ఈ దుర్ఘటన తరువాత కూడా ఉపశమనాన్ని ఇచ్చే అంశమే; నీ స్వభావానికి అనుగుణమైనవే నీవు పడుతున్న కష్టాలూనూ; జరిగే చెడును అతి తక్కువగా ఉంచడానికి, జరిగే మేలును అధికంగా ఉంచడానికి దేముడు ప్రయత్నిస్తాడు; ఇంతకన్నా మేలు చేయలేని స్థితిలో ఆయన దాన్ని అలా జరిగేలా చూశాడు. చెడు గురించి మనిషిలో వెదకగలం, దేవుడిలో కాదు. లిస్బనీయులు 20 వేల ఇళ్లను అయిదారు అంతస్థుల భవనాలుగా కట్టకుండా ఉండుంటే, ఇళ్లను ఒకదాని కొకటి దూరంగా ఉండేట్టు చూసుకుని ఉంటే, కంపం మొదటి ప్రకంపనకే జనం పారిపోయే అవకాశం ఉండేది; అంతేగాక కూలుతున్న ఇళ్లలోనుంచీ వాళ్ళ వాళ్ళ బట్టలు, దస్తావేజులు, డబ్బు తెచ్చుకుందామన్న కోర్కె ప్రాణాలు కోల్పోయేలా చేసింది; ఏ రోగమో రొష్టుతోనో తీసుకుని చావడం కన్నా, భూకంపంవలన పోవడం మెరుగే కద? చావడానికి ముందూ వెనుకా ఏమిటీ?' “

ఉన్నట్టుండి చెబుతున్నది ఆపేశాడు ఆగంతకుడు. గుడ్లు మిటకరించి అనంతం వైపు చూస్తున్నాడు. కళ్ళు మెరుస్తున్నాయి. ఎందుకలా నన్ను చూస్తున్నాడు వాడు అనుకున్నాడు అనంతం. గుడ్లు బల్లి గుడ్లలా ఉన్నాయి. మనిషి అందం, అనాకారితనం గురించి పక్కనుంచుదాం. కానీ ప్రతి అనాకారితనం లోను దాని ప్రత్యేకత లేక వింతదనము దాగి ఉంటుందేమో అనిపించింది అనంతానికి.

"నా గురించీ ఏదో ఆలోచిస్తున్నారు మా అన్నయ్య; అదేమిటో నేను గ్రహించగలను.”

గతుక్కుమన్నాడు అనంతం.

"నీకు ఏదో అతీంద్రియ శక్తి ఉన్నట్లుంది కానీ ఇప్పుడు నీవు గ్రహించింది తప్పు. బ్రహ్మ పదార్ధం గురించి ఆలోచిస్తోంది నా మనసు!"

"మీ మొహం మీరు అబద్ధం ఆడుతున్నారంటోంది."

"ఒక్క డార్విన్ అందరు తత్త్వవేత్తల మీమాంసలకూ భరతవాక్యం పలికాడంటావా?"

"లేదు. విజ్ఞాన శాస్త్ర వేత్తలే అతని వాదన తప్పని నిరూపించే ప్రయత్నం చేశారు."

"దేన్ని నమ్మగలం? సమస్యలు సమస్యలు గానే లేక ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోయాయి."

"వాటిని సమస్యలుగా మీరూ అంగీకరిస్తున్నారా?"

"నీ దృష్టిలో అవి సమస్యలు. నీ మాటలను నేనన్నానీ తరఫున."

"అయితే మీ దృష్టిలో అవి సమస్యలు లేక ప్రశ్నలు కావని చెబుతున్నట్లేనన్నమాట."

"నా అజ్ఞానం, పరిణితిచెందని మనసు కారణంగా అలా భావిస్తుండవచ్చు. అలా భావించడమే నాకు ఇష్టం. ఆ విషయంలో ప్రశాంతంగా జీవించగలుగుతాను," అనంతమన్నాడు.

"సరే. సాలెపురుగు గురించి ఒక చోట చదివాను. ఆ చోటు ఏదో కూడా చెబుతాను. అహంభావం అనవసర; ఒక పిల్లల పుస్తకంలో. ఈ జీవి గాలిలో, నీటిలో, భూమి పైనా, దానిలోనా ఉండగలదు. చుక్క పరిమాణం నుంచి 20 సెం. మీ. దాకా ఉంటుంది. కొన్ని రకాలు నీరు లేకుండా సంవత్సరకాలం బతక గలవు. పదిహేనేళ్ల కాలం జీవించగలదు. ఎనిమిది కాళ్ళు, ఎనిమిది కళ్ళు ఉంటాయి. పొట్ట దగ్గరున్న గ్రంథులు సిల్కు దారాన్ని తయారు చేస్తాయి. ద్రవం రూపంలో వెలుపలికి వచ్చి ఘనీభవిస్తుంది. కొన్నిదారాలు మెత్తగా, పట్టులా ఉండగా, కొన్ని జిగటగా ఉండి పురుగులను పట్టుకోవడానికి ఉపయోగ పడతాయి. వింతయిన విషయం – దాని కాళ్ళకు ఒకరకమైన నూనె పూసి ఉండటం వలన తాను అల్లే వలలో ఆది బందీ కాదు. ఒక సాలెపురుగు సృష్టి మనల్ని అంత అచ్చెరువుకు గురిచేస్తున్నప్పుడు ఈ సృష్టివివరం అత్యంత అల్పంగా మనకు తెలిసినా మన మెదడు బుడగలా పేలిపోతుందేమో, గుండె ఆగిపోతుందేమో. కానీ తిట్టే నోరు, తిరిగే కాలు ఊరుకోనట్లే ప్రతీది తెలుసుకోవాలన్న కామనను ఊపిరిగాకల మనసును ఎలా ఊరుకోబెట్టగలం? ఎన్ని తెలుసుకుని భరించగలదో అన్ని తెలుసుకుని ధ్వంసమవనీ. చేసుకున్న దానికి చేసుకున్నంత."

"సాలెపురుగు గురించే కానీ, బ్రహ్మపదార్థం గురించే కానీ తెలుసుకోవడం వలన ఒరిగేదేముంది? తెలుసుకోకపోవడం వలన ఒరగనిదేముంది?"

"ముందే చెప్పేను కదా మనసు స్వభావం గురించి. పైగా బ్రహ్మను తెలుసుకోవడం వలన జన్మరాహిత్యం అనే పరమ మేలు మనం పొందగలుగుతాం దానితో లీనమై, మరో జన్మ వేదన నుంచి శాశ్వతంగా తప్పించుకుని. మానవ

జీవితాన్ని అంతగా ప్రేమిస్తూ ఒక జన్మతో కుతి తీరక మళ్ళీ, మళ్ళీ ఈ అద్భుతమైన ప్రపంచంలోకి వస్తుండాలని భావించేవాళ్లు బ్రహ్మజోలికి వెళ్ళకపోవడం మంచిదేమో. "

"ప్రస్తుత జన్మలాంటి సంతృప్తికరమైనవే దొరుగుతాయని హామీ లేదు కదా? పైగా కర్మను శాసించలేము కదా."

"మంచి కర్మనే ఎన్నుకుని దాన్ని పాటిస్తుంటే మరో జన్మ మంచిదే దొరకచ్చుగా?"

"చెప్పలేం. మనం చేసే పనులు మన అదుపులో ఉండొచ్చు ఉండకపోవచ్చు. ప్రారబ్ధ కర్మ ఒకటుంది కదా; అసలు ఏది తప్పో, ఏది ఒప్పో మనకు తెలియని అజ్ఞానులం. ఎవడికి వాడే వాడు చేస్తున్న పనులపట్ల న్యాయమూర్తి కావాలి."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS